క్లుప్తంగా

దుబ్బాక మున్సిపల్ అభివృద్ధికి చర్యలు

చైర్‌పర్సన్ గన్నె వనిత



పార్క్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: దుబ్బాక మున్సిపాల్టీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ గన్నె వనిత తెలిపారు. బుధవారం పట్టణంలోని 18వ వార్డులో జరుగుతున్న పార్క్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాల్టీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలు, పాలకమండలి సహకారంతో దుబ్బాకను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. 18వ వార్డులో పిల్లల పార్క్ పనులు పూర్తికావచ్చాయని, త్వరలో ప్రారంభిస్తామన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: భవిష్యత్ కోసం ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత విద్యార్థులను సూచించారు. బుధవారం పట్టణంలోని సిద్దార్థ హైస్కూల్‌లో బసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ స్వర్ణలత, పాఠశాల చైర్మన్ రాధా సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా శక్తి యూనిట్లపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీడీ మధుసూదన్

హుస్నాబాద్‌రూరల్: స్వశక్తి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమం చేపట్టిందని, దీనిలో 16 రకాల యూనిట్లు ఉంటాయని డీఆర్‌డీఓ ఏపీడీ మధుసూదన్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల సీఏలు, సమాఖ్య అధ్యక్షులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందే యూనిట్లను ఎంపిక చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తే వారు యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తారన్నారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ కరుణాకర్, వాసుదేవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం



శ్రీదేవి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ జోగు ప్రభుదాస్

దుబ్బాకటౌన్: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో గొప్పదని, గౌరవంగా పదవీ విరమణ చేయడం గొప్ప అదృష్టమని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. పదవీ విరమణ చేసిన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కలకుంట్ల శ్రీదేవి దంపతులను బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయురాలు శ్రీదేవి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఉన్నత విద్యా సేవ అంటే చిట్టచివరి క్షణం వరకు తరగతి గదిలో బోధన చేయడమని, ఈ విషయంలో ఆమె వంద శాతం విజయం సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం

- జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి
- ఎంపీపీ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సమావేశం
- సమస్యలను సభ దృష్టికి తెచ్చిన సభ్యులు
- పరిష్కరిస్తామన్న అధికారులు



మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రాజకీయాలకతీతంగా మండల అభివృద్ధిలో అందరం భాగస్వాములవుదామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దూరు మండలంతో 20 ఏళ్లుగా అనుబంధం ఉందన్నారు. తొలి, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన పోరాటంలో మద్దూరు మండలం ముందు వరుసలో ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మండలంలోని ప్రతీ గ్రామం పాల్గొందని చెప్పారు. పార్టీలకతీతంగా తనను గెలిపించారన్నారు. విద్య, వైద్యం అందేలా కృషిచేస్తానన్నారు. ఈ ప్రాంత సమస్యలు, మండల హక్కుల సాధన కోసం, నిధుల కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఐదేళ్లు సేవచేసిన ఎంపీటీసీలను అభినందించారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయాలని కోరారు. అంతకు ముందు మండలంలో సర్వేయర్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ప్రతీరోజూ పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టుకుంటూ గొడవలు పడుతున్నారని వెంటనే సర్వేయర్‌ను నియమించాలని రేబర్తి ఎంపీటీసీ కూరల రాజు సభ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించి సర్వేయర్‌ను నియమిస్తామని తహసీల్దార్ సంజీవ్ తెలిపారు. ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించడం లేదని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ కృష్ణారెడ్డి జెడ్పీటీసీ కొండల్ రెడ్డి ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ (ఈసీ) పరశురాములను కోరారు. మూడేళ్లుగా జాలపల్లి గ్రామ పాఠశాలలో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు నిర్మించాలని కోరినా ఈసీ పట్టించుకోవడంలేదని జాలపల్లి ఎంపీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమైనందున త్వరగా పనులు పూర్తి చేయాలని ఎంపీపీ ఈసీని ఆదేశించారు. జాలపల్లి, కొండాపూర్ గ్రామాల్లో రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు రావడంలేదని ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకురాగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. వ్యవసాయ బావుల వద్ద, ఇళ్లపైన విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు సభలో ప్రస్తావించారు. ఇప్పటి వరకు 20 స్తంభాలను ఏర్పాటు చేశామని, త్వరలో మిగతా వాటిని కూడా ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. అనంతరం పదవీ కాలం పూర్తయిన ఎంపీటీసీలను ఎమ్మెల్యే సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ గిరికొండల్ రెడ్డి, ఎంపీడీఓ రామ్మోహన్, తాహసీల్దార్ సంజీవ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించాలి

సిద్దిపేట డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రాజు



విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న సంక్షేమ అధికారి రాజు

హుస్నాబాద్: ప్రభుత్వ ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలను బుధవారం సిద్దిపేట డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పోగుల రాజు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వసతి గృహాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మెనూ కచ్చితంగా పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతీనెల స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు. విద్యార్థులకు నోట్ బుక్స్, బెడ్‌షీట్స్, కార్పెట్లు మూడు రోజుల్లో అందిస్తామన్నారు. ఆయన వెంట వసతి గృహ సంక్షేమ అధికారి ఇట్టబోయిన వెంకటయ్య ఉన్నారు.

అపరిచితులను నమ్మి మోసపోవద్దు

గజ్వేల్‌రూరల్: అపరిచితులను నమ్మి మోసపోవద్దని, చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. సమస్యలపై 100, 112, 1098, షీటీమ్ వాట్సాప్ (8712667343), మహిళా పోలీస్ స్టేషన్ (8712667435)కు సమాచారం ఇవ్వాలన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య

వనమహోత్సవంలో మొక్కలు నాటాలి

డీఆర్‌డీఓ జయదేశ్ ఆర్య

నంగునూరు(సిద్దిపేట): వన మహోత్సవంలో ప్రజలు మొక్కలు నాటాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా అన్నారు. బుధవారం నంగునూరులోని ఆయిల్‌పామ్, మామిడి తోటలను సందర్శించారు. రైతులు సంతోష్‌రెడ్డి, త్రివేణితో మాట్లాడి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈజీఎస్ పనులను పరిశీలించారు. మండలంలో చేపట్టిన పనులు, వన నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలు తెలుసుకొని మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేలా ఏపీఓ, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రభాకర్‌రావు, కార్యదర్శి చంద్రకళ, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణపై అవగాహనే లక్ష్యం

గజ్వేల్ ఏడీఏ బాబునాయక్



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న గజ్వేల్ ఏడీఏ బాబునాయక్

గజ్వేల్: భూసార పరిరక్షణపై భావితరాలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా స్కూల్ సాయిల్ హెల్త్ ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కింద ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక పాఠశాలగా ఎంపికైన గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం భూసార పరీక్షలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. భూమిలో పోషకాలు లోపిస్తే వాటిని తిరిగి పొందే పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకుంటే ఎరువుల వాడకం తగ్గించవచ్చన్నారు. ప్రతీరైతు తన పొలంలో ఏటా మట్టి పరీక్షలు చేయించుకొని అవసరమైన పోషకాలను తిరిగి పొందే పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపాల్స్ విజయపాల్‌రెడ్డి, రాయప్పరెడ్డి, ఏఈఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు ప్రాధాన్యం



పోతారంలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పోతారంలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలనే సంకల్పంతో ప్రభుత్వమిచ్చిన ఆదేశాల మేరకు మూతపడ్డ పాఠశాలలను తెరిపించామన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజన వసతులు కల్పించిందన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మప్ప, సెక్టోరల్ అధికారి భాస్కర్, ఎంపీఓ విష్ణు, ఎంఎల్‌ఓ లక్ష్మి, హెచ్‌ఎం రఘునాథ్, శ్రీరాములు, రేణుక, జ్యోతి పాల్గొన్నారు.

నిధులు లేకున్నా అభివృద్ధి చేశాం

జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: స్థానిక సంస్థలకు నిధులు లేకున్నా అభివృద్ధి చేశామన్న సంతృప్తిగా ఉందని జెడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీపీ, ఎంపీటీసీల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైస్ చైర్మన్‌గా రూ.6 కోట్ల అభివృద్ధి పనులు చేశానని, సిద్దిపేట జిల్లా వైస్ చైర్మన్‌గా రూ.60 లక్షల పనులు చేయలేకపోయానని అసంతృప్తి ఉన్నా తమ హయాంలో గ్రామాలను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. మిషన్ కాకతీయ కింద చెరువుల తవ్వకం, చేపల పెంపకం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల ఏర్పాటు, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు. నూతన పంచాయతీల ఏర్పాటుతో ప్రతీ గ్రామంలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తమ నియోజకవర్గానికి మంత్రి పదవి రావడం మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నామని, స్థానిక ప్రజా ప్రతినిధులను అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ లకావత్ మానస, ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేం

దుబ్బాకటౌన్: ఐదేళ్లుగా అధికారులు, ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తుండటంతో బుధవారం దుబ్బాకలో వారిని ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. దౌల్తాబాద్ మండల ఎంపీపీ గంగాధరీ సంధ్య, జెడ్పీటీసీ రణం జ్యోతి, ఎంపీటీసీలు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

ప్రజానాయకులకే గుర్తింపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాజకీయ నాయకుల కంటే ప్రజానాయకులకే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం పూర్తికావడంతో బుధవారం మండల కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ యాదగిరి ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భగవంతం, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యుడు ఇక్బాల్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): పదవీ కాలం పూర్తయిన మండలంలోని గాగిల్లాపూర్ ఎంపీటీసీ సభ్యుడు కొమిరె మల్లేశంను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నాడి సత్యనారాయణరెడ్డి, వెంటేశం, లక్ష్మణ్, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు సహకరించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నీట్ పరీక్షలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని గురువారం దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. బంద్‌కు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు అజ్మత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో..

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ నిర్వహించనున్నట్లు ఏఐఎస్‌బీ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుము, ఉపకార వేతనాల విడుదల తదితర అంశాలను పరిష్కరించాలని బంద్‌కు పిలుపు ఇచ్చామన్నారు.

విప్లవాత్మక మార్పునకు ఎరుపు సూచిక

ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎరుపు రంగు విప్లవాత్మక మార్పును సూచిస్తుందని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో రెడ్ కలర్‌డే నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు, వస్తువులు ధరించి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుపు రంగు సమాజంలో మార్పు కోరుతుందన్నారు.

వారిని పార్టీలో చేర్చుకోవద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ద్రోహం చేసిన నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీలో చేరాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీలో చేరితే గ్రామాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు.

అన్నప్రసాద వితరణ

కొండపాక(గజ్వేల్): వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి పేరిట ఏకాదశి నుంచి ద్వాదశి వరకు పిడికెడు బియ్యం ఇచ్చేలా సంఘం సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ బియ్యంతో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ సంఘం అధ్యక్షుడు గంగిశెట్టి పాండురంగం, మహిళా సంఘం అధ్యక్షుడు కాపర్తి స్రవంతి, కార్యవర్గ సభ్యులు ఉప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల వీధి కుక్కలను చంపేశారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఘటనపై హైదరాబాద్ జంతువుల సంరక్షణ సంస్థ ప్రతినిధులు సీపీ అనురాధకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రాహుల్ క్షమాపణ చెప్పాలి



గజ్వేల్‌లో రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని గజ్వేల్ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేష్ తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు సాన వేణు బుధవారం డిమాండ్ చేశారు. అధికారం రాలేదన్న అక్కసుతో పార్లమెంట్‌లో హిందూ దేవతలను అవమానపరిచేలా మాట్లాడి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆదర్శ పాఠశాలలో వన మహోత్సవం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మలత మాట్లాడుతూ చెట్లతోనే భావితరాల మనుగడ అని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతీ ఇంటి ముందు పూలు, పండ్ల మొక్కలు నాటాలన్నారు.

◆ డబ్బులు ఇస్తేనే గుంతల పూడ్చివేత

నంగునూరు(సిద్దిపేట): డబ్బులిస్తేనే గుంతలు పూడుస్తున్నారని, ఇవ్వనివారిపట్ల వివక్ష చూపుతున్నారని పాలమాకుల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఆరు నెలల కిందట గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఇరువైపులా మురుగు కాల్వ నిర్మాణం పనులు చేపట్టారు. పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా మురుగు కాల్వ పక్కన గుంతలు పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి గుంతలు పూడుస్తున్నారని ఆరోపించారు. అధికారుల స్పందించి గుంతల పూడ్చివేతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మసిరెడ్డితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం టీఆర్ అసోసియేట్స్ అండ్ ఇంజనీర్స్ హుస్నాబాద్ నిర్వాహకుడు మాలోతు రఘుపతి నోట్ బుక్స్, పలకలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

◆ పంచాయతీ కార్మికుల భిక్షాటన

గజ్వేల్‌రూరల్: తమకు వేతనాలు సకాలంలో రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుకు నిరసనగా బుధవారం పట్టణంలోని ఐవోసీ వద్ద మండల పరిధిలోని కార్మికులు భిక్షాటన చేపట్టారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ కార్మికుల వేతనాలు చెల్లించాలి

హుస్నాబాద్‌రూరల్: సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, కార్మికులు మహేందర్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బ్లీచింగ్, దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

◆ గుంతలుపడ్డ రోడ్డుకు మరమ్మతులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు – గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన సొంత ఖర్చుతో మరమ్మతు చేయించారు. బెజ్జంకి, గన్నేరువరం మండలాలలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం ఈరోడ్డు గుండా కరీంనగర్‌కు రాకపోకలు సాగిస్తారు. గుంతలమయం కావడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

◆ ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరణ

కొండపాక(గజ్వేల్): మండలంలోని గిరాయిపల్లి గ్రామానికి బుధవారం ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరించారు. పాఠశాలలు, కాలేజీలు వెళ్లేందుకు విద్యార్థులు, వ్యక్తిగత పనులపై సిద్దిపేట, గజ్వేల్ తదితర పట్టణాలకు వెళ్లే వారు సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న సిర్సనగండ్ల గ్రామం వరకు కాలినడకన రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గ్రామస్తులు జెడ్పీటీసీ భర్త అనంతుల ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మాదిరిగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన డీఎం బస్సు సర్వీసు పునరుద్ధరించారు.

◆ వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల నోడల్ అధికారి గుగులోతు రంగానాయక్ అన్నారు. అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీ వెంకటనర్సయ్య ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయనను సన్మానించారు.